## స్వశక్తితో ఎదిగే మహిళలకు చేయూతనివ్వాలి

### ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్


వస్తువులను పరిశీలిస్తున్న పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం, జూన్ 3 : చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని స్వశక్తితో ఎదిగే ఆదివాసీ మహిళలకు ప్రతి ఒక్కరూ చేయూతనందించాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ మహిళలు ఎంఎస్ఎంఈ యూనిట్ ద్వారా చిన్నతరహా పరిశ్రమ నెలకొల్పుకున్నారని, వారే సొంతంగా తయారు చేసిన ఆరు రకాల సబ్బులు, షాంపూలను ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే ప్రజలకు సరసమైన ధరలకు అమ్ముకోవడానికి అవకాశం కల్పించామన్నారు. మహిళలు ఎంతో కష్టపడి తయారు చేసిన వస్తువులను ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసి వారికి తోడ్పాటు అందించాలని కోరారు. వివిధ రకాల ఔషధ గుణాలు కలిగిన వనమూలికలతో సబ్బులు, షాంపూలు తయారు చేస్తారని, అవి మన శరీరానికి ఎలాంటి రుగ్మతలు రాకుండా చేస్తాయన్నారు. అలాగే ఓం శక్తి మహిళా గ్రూపు సభ్యులు సెంట్, ఫినాయిల్, కొవ్వొత్తులు, సర్ఫ్ ప్యాకెట్లు తయారు చేసి విక్రయిస్తున్నారని, వారికి కూడా చేయూతనందించాలన్నారు. అనంతరం గిరిజన మహిళలు తయారు చేసిన వస్తువులను పీవో కొనుగోలు చేశారు.

## రూ.22.5 వేల కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


కొత్తకొత్తూరులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి(నేలకొండపల్లి), జూన్ 3 : రాష్ట్రంలో పేదలందరికీ సొంత ఇంటి నిర్మాణం కోసం రూ.22.5 వేల కోట్లతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని రాబోయే మూడేండ్లలో నెరవేరుస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం నేలకొండపల్లి మండలంలోని కొత్తకొత్తూరు, మంగాపురం తండా, కట్టుకాచారం, కొంగర, పైనంపల్లి, రామచంద్రాపురం, బుద్ధారం, చెరువుమాదారం, రాజారాంపేట, అజయ్‌తండా, తారుమలాపురం, పాతకొత్తూరు, చెన్నారం, సుర్దేపల్లి గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పాలేరు ప్రజల దీవెనలతో మంత్రి పదవి పొందిన తాను పాలేరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. ప్రతి గ్రామంలో సీసీరోడ్లను పూర్తిగా నిర్మిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ వజ్జా రమ్య, నాయకులు శాఖమూరి రమేశ్, వెన్నెపూసల సీతారాములు, నెల్లూరి భద్రయ్య, సర్ణ, గోవిందు, బొడ్డు బొందయ్య, అంజి, రాయపుడి నవీన్, మామిడి వెంకన్న, మైసా శంకర్ పాల్గొన్నారు.

# ఆ రైతు ధాన్యం కొనాల్సిందే..

- జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల స్పష్టీకరణ
- రైస్ మిల్లు యజమానికి ధాన్యం విక్రయం పూర్తి
- దిగొచ్చిన అధికారులు.. 'నమస్తే' కథనానికి స్పందన


రైతు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సుజాతనగర్‌లో రైస్ మిల్లు బాధ్యులను ఆదేశిస్తున్న అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : 'ధాన్యం బాగాలేదు. వడ్లన్నీ ముక్కిపోయాయి. నేను తీసుకోను.' అంటూ ఓ రైతు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు నిరాకరించిన రైస్ మిల్లు యజమానితో సంబంధిత అధికారులు సదరు ధాన్యాన్ని కొనుగోలు చేయించారు. ఒక్కసారి ఆన్‌లైన్ పూర్తయిన తరువాత ధాన్యం ధర మార్చడం కుదరదని, కొనుగోలు చేయబోనని చెప్పడానికి వీలు లేదని తేల్చిచెప్పారు. ఓ రైతు కొనుగోలు కేంద్రంలో విక్రయించిన ధాన్యాన్ని రైస్ మిల్లు యజమాని నిరాకరించిన అంశంపై 'కొన్నదే తక్కువ.. అందులోనూ కొర్రీలు..' శీర్షికన 'నమస్తే తెలంగాణ' సోమవారం ప్రచురించిన కథనానికి కలెక్టర్ ప్రియాంక ఆదేశాలతో సివిల్ సప్లయీస్ అధికారులు స్పందించారు. ఉదయమే హుటాహుటిన రైస్ మిల్లు వద్దకు వెళ్లి ఆరా తీశారు. లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన రైతు మేరెడ్డి జనార్దన్‌రెడ్డి నాలుగు రోజుల క్రితం హేమచంద్రాపురంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తన ధాన్యాన్ని విక్రయించాడు. తేమ శాతాన్ని పరిశీలించిన అధికారులు.. నిర్ణీత ప్రమాణాల మేరకే ఉందని గుర్తించి కాంటా వేసి రైతుకు రసీదు ఇచ్చారు. ఆ ధాన్యాన్ని సుజాతనగర్ రైస్ మిల్లుకు పంపారు. అయితే ఈ ధాన్యం బాగాలేదని, వడ్లు ముక్కిపోయాయని ఆ రైస్ మిల్లు యజమాని ఈ ధాన్యాన్ని తిరస్కరించాడు. దీంతో సదరు రైతు లబోదిబోమంటూ అక్కడే ఉండిపోయాడు. ఈ విషయంపై 'నమస్తే తెలంగాణ'లో సోమవారం కథనం ప్రచురితం కావడంతో అధికారులు వెంటనే రైస్ మిల్లుకు వెళ్లారు. రైతు జనార్దన్‌రెడ్డిని పిలిచి అతడి సమక్షంలో ధాన్యాన్ని పరిశీలించారు. తేమ శాతం, తాలు శాతం పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ధాన్యం కొనుగోలు చేసినప్పుడు మిల్లు యజయాని తీసుకోవాల్సిందేనని వారు చెప్పడంతో మిల్లు యజమాని ఆ ధాన్యాన్ని తీసుకున్నాడు.

### మద్దతు ధరకే కొనుగోలు..

వడ్లు బాగాలేవని, అందుకే తిరస్కరించానని మిల్లు యజమాని చెప్పిన అంశాన్ని గమనించిన అధికారులు.. ఆ ధాన్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చే కామన్ రకం ధర రూ.2,100 చొప్పునే కొనుగోలు చేశారు. ఒకసారి ఆన్‌లైన్ అయ్యాక ధర మార్చడం కుదరదని అన్నారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక అందించనున్నారు. అలాగే, ఈ వ్యవహారంలో తప్పిందం చేసిన అధికారులపై చర్యలు తీసుకోనున్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

### భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల


విత్తన దుకాణాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

పాల్వంచ, జూన్ 3 : నకిలీ విత్తనాలు ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల హెచ్చరించారు. సోమవారం పాల్వంచ పట్టణంలోని కిన్నెరసాని రోడ్‌లో ఉన్న ఎరువులు, విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ వివిధ రకాల విత్తనాలు, నిల్వల రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 564 అవుట్‌లెట్స్ కేంద్రాల ద్వారా రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. సుమారు 4,47,411 ప్యాకెట్ల పత్తి విత్తనాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు కంపెనీ ప్యాక్ చేసిన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని, గుడ్డ సంచుల్లో, బయట విక్రయించే విత్తనాలు కొనుగోలు చేయొద్దన్నారు. విత్తనాలు కొనే ముందు రైతులు కంపెనీ హోలోగ్రామ్ చూసి కొనాలన్నారు. వారి వారి వ్యవసాయ భూములకు అనుకూలంగా ఉండే పంటలు వేసుకోవడం, ఎలాంటి విత్తనాలు కొనాలో 15 రోజుల నుంచి వ్యవసాయ శాఖ అధికారులు రైతు వేదికలపై అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విద్యాచందన, వ్యవసాయాధికారి బాబురావు, పాల్వంచ తహసీల్దార్ వివేక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

కొత్తగూడెం టౌన్, జూన్ 3: పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు పరీక్షకు 252 మంది విద్యార్థులకుగాను 176 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు.

## 477 క్వింటాళ్ల గంజాయి పట్టివేత

### వివరాలు వెల్లడించిన సీఐ సతీశ్‌కుమార్

మణుగూరు టౌన్, జూన్ 3 : మామిడికాయల లోడు మాటున గంజాయి ప్యాకెట్లను తరలిస్తుండగా మణుగూరు పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఈ మేరకు సీఐ సతీశ్‌కుమార్ మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం వివరాలను వెల్లడించారు. ఎస్‌ఐ మేడ ప్రసాద్ తన సిబ్బందితో పక్కా సమాచారం మేరకు హనుమాన్ ఆలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం తనిఖీలు చేపట్టారు. దీంతో కారులో ఇద్దరు పైలట్‌గా వెళ్తూ.. వెనుక అశోకా లేలాండ్ వాహనంలో మామిడికాయ బస్తాల మాటున గంజాయి ప్యాకెట్లను మరో ముగ్గురు వారి వెనుక వస్తూ తరలిస్తుండగా పట్టుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయడంతో 477 క్వింటాళ్ల గంజాయి బయటపడింది. దీనిని డొంకరాయి చిత్రకొండకు చెందిన రవి, మధు, ఉపేందర్, మర్రిగూడకు చెందిన ఉపేందర్, బాచలూరుకు చెందిన పంగి గురుల వద్ద కొనుగోలు చేసి జహీరాబాద్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. గంజాయి విలువ సుమారు రూ.1.19 కోట్లు ఉంటుందన్నారు. యాదాద్రి జిల్లా భువనగిరికి చెందిన చెరుకుపల్లి శ్రీకాంత్, గుమ్మడెల్లి అర్జున్‌లతోపాటు పొల్లూరు మోతుగూడెంకు చెందిన పంగి సునీల్‌తోపాటు ఇల్లెందుకు చెందిన రాయకంటి నాగరాజు, ఎజ్జు సృజన్‌లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వీరి వద్ద నుంచి కారు, ట్రాలీతోపాటు 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. చెరుకుపల్లి శ్రీకాంత్‌పై గతంలో 14 కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించామని సీఐ వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రసాద్, సిబ్బంది, రవీందర్, రామారావు, బుచ్చిబాబు, కోటి తదితరులు పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

## గంజాయితో దొరికితే జైలుకే..

### పోలీస్ అధికారుల సమీక్షా సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజు


సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు, పాల్గొన్న అధికారులు

కొత్తగూడెం క్రైం, జూన్ 3 : నిషేధిత గంజాయితోపాటు మత్తు, మదకద్రవ్యాలతోఎవరైనా పట్టుబడితే జైలుకు వెళ్లాల్సిందేనని ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు స్పష్టం చేశారు. ఎస్పీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని పోలీస్ అధికారులతో సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి రవాణా నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలని, ఎవరైనా గంజాయితో పట్టుబడితే ఉపేక్షించకుండా వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మత్తు, మాదకద్రవ్యాలను తరలించే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. జిల్లా సరిహద్దున ఉన్న ఇతర రాష్ట్రాల, జిల్లాల పోలీస్ అధికారులతో సమన్వయం పాటిస్తూ కచ్చితమైన సమాచారంతో దాడులను ముమ్మరం చేయాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీఎస్ఎన్ఏబీ) సూచనలతో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి నిషేధిత గంజాయిని తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు అక్రమంగా రవాణా చేసేందుకు అక్రమార్కులు ప్రయత్నిస్తున్నారని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఎస్పీ ప్రజలను కోరారు.

## అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి

### డీఏవో విజయనిర్మల

చింతకాని, జూన్ 3 : వ్యవసాయ శాఖ అనుమతించిన అధీకృత డీలర్ల వద్దే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) విజయనిర్మల తెలిపారు. నాగులవంచలోని ఓ విత్తన దుకాణాన్ని సోమవారం తనిఖీ చేసిన ఆమె స్టాక్ రిజిస్టర్, పత్తి విత్తన ప్యాకెట్ల నాణ్యత, గడువు తేదీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీటీ-2 విత్తనాలన్నీ ఒకటేనని, రైతులు ఒకే కంపెనీ విత్తనాలు కోరడం వల్ల ప్రయోజనం లేదని, అన్ని బీటీ-2 విత్తనాలు ఎకరాకు 8 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. తొలకరి వర్షాలకే విత్తనాలు విత్తొద్దని, 60 సెంటీమీటర్ల పైగా వర్షపాతం నమోదైన తర్వాత విత్తాలన్నారు. అధిక ధరలకు విక్రయించినా, అనుమతి లేని విత్తనాలు అమ్మినా సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పల్లెల్లో నకిలీ విత్తనాలు, బీటీ-3, లూజు సంచుల్లో విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మధిర ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, ఏవో పల్లెల నాగయ్య, ఏఈవో రాము, హరికృష్ణ, శ్రీకాంత్, డీలర్లు పాల్గొన్నారు.


నాగులవంచలో రైతులతో మాట్లాడుతున్న డీఏవో విజయనిర్మల

వాణిజ్య

# వడ్డీరేట్లు ఇప్పట్లో తగ్గవ్!




### ఈ ఏడాది ఆఖరుదాకా ఇంతే • పీఎన్‌బీ ఎండీ అతుల్ కుమార్ గోయల్

న్యూఢిల్లీ, జూన్ 3: వడ్డీరేట్లు ఇప్పట్లో తగ్గబోవని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మేనేజింగ్ డైరెక్టర్ అతుల్ కుమార్ గోయల్ అన్నారు. ఈ ఏడాది ఆఖరుదాకా ఇంతేనన్న ఆయన.. డిసెంబర్ ద్రవ్యసమీక్షలో కోతలకు వీలుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బుధవారం (జూన్ 5) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను రెండో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ప్రారంభించనున్నది. శుక్రవారం (జూన్ 7) నిర్ణయాలను ప్రకటించనున్నది. ఈ నేపథ్యంలో పీఎన్‌బీ ఎండీ గోయల్ అంచనా ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. కరోనా సమయంలో దిగాలు పడిన దేశ ఆర్థిక వ్యవస్థను ఉత్సాహపర్చేందుకు.. ఆర్బీఐ పెద్ద ఎత్తున వడ్డీరేట్లను తగ్గించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పరిస్థితులు చక్కబడటంతో ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా వడ్డీరేట్లను భారీగా పెంచుతూపోయిన సంగతీ విదితమే. దీంతో రెపో రేటు 6.50 శాతానికి చేరింది. ఫలితంగా అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్లూ పెరిగాయి.

### ఈఎంఐల భారం..

కరోనా సమయంలో వడ్డీరేట్లు తగ్గడంతో అంతా గృహ, వాహన, వ్యక్తిగత రుణాలను తీసుకున్నారు. అయితే ఇప్పుడు ఆ వడ్డీరేట్లు పెరగడంతో ఆయా రుణాల ఈఎంఐ (నెలవారీ వాయిదాలు)లు భారంగా తయారయ్యాయని రుణగ్రహీతలు లబోదిబోమంటున్నారు. ఈసారి తగ్గుతాయంటూ.. ప్రతీసారీ ఎదురుచూస్తూనే ఉన్నారు. అయినప్పటికీ వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ఆర్బీఐ తమ ద్రవ్యసమీక్షల్ని ముగించేస్తున్నది. గత 8సార్లూ ఇదే జరిగింది. ఈ నేపథ్యంలో రాబోయే ద్రవ్యసమీక్షపై గట్టిగానే ఆశలు పెట్టుకున్నారంతా. కానీ వస్తున్న అంచనాలు నీరుగార్చేలా ఉంటున్నాయి. 'వడ్డీరేట్లు అనేవి వృద్ధి, ద్రవ్యోల్బణం, వివిధ దేశాల్లో ద్రవ్య విధానాల వంటి రకరకాల అంశాలపై ఆధారపడి ఉంటాయి. అయితే ఇప్పటికే ఆర్బీఐ.. కీలక వడ్డీరేట్లను గరిష్ఠ స్థాయికి చేర్చింది. బహుశా ఈ ఏడాది ఆఖర్లో తగ్గింపులకు అవకాశాలున్నాయని చెప్పుకోవచ్చు' అని గోయల్ అన్నారు.

### డిపాజిట్లపై వడ్డీలు పెరగవు

డిపాజిట్లపై వడ్డీరేట్లు ఇక పెద్దగా పెరగబోవని, 95 శాతం డిపాజిట్ల వడ్డీరేట్లను ఇప్పటికే సవరించడం జరిగిందని గోయల్ తెలిపారు.



దీంతో మరో 4-5 నెలలు వడ్డీరేట్లపై స్థబ్ధత ఉంటుందన్న సంకేతాలనిచ్చారు. కాగా, రిటైల్, వ్యవసాయ రంగాలతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) సంస్థలకు రుణాలివ్వడంపై పీఎన్‌బీ దృష్టిపెట్టినట్టు గోయల్ చెప్పారు. అయినప్పటికీ రుణ చరిత్ర బాగున్న కార్పొరేట్ సంస్థలకూ లోన్లిస్తామన్నారు. మౌలిక రంగ ప్రాజెక్టుల నుంచి, ముఖ్యంగా రహదారుల ప్రాజెక్టుల నుంచి రుణాలకు డిమాండ్ ఉందని చెప్పారు.

## సాథీ 2.0 మొబైల్ యాప్

- ఇన్వెస్టర్ల కోసం తెచ్చిన సెబీ




న్యూఢిల్లీ, జూన్ 3: క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. సోమవారం 'సాథీ 2.0' మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పర్సనల్ ఫైనాన్స్‌లోని సంక్లిష్ట ఆర్థికాంశాలను సరళతరం చేయడమే లక్ష్యంగా సమగ్ర సాధనాలతో మదుపరుల కోసం ఈ నయా మొబైల్ అప్లికేషన్‌ను సెబీ తీసుకొచ్చింది. 'ఆధునికీకరించిన 'సాథీ' యాప్ ఎంతో యూజర్ ఫ్రెండ్లీ'గా ఉంటుందని ఓ ప్రకటనలో సెబీ పేర్కొన్నది. ఇందులో ఫైనాన్షియల్ క్యాలిక్యులేటర్స్, మాడ్యుల్స్ ఉంటాయని, స్టాక్ ఎక్స్ఛేంజీల్లో షేర్ల క్రయవిక్రయాలు, మ్యూచువల్ ఫండ్స్, ఈటీఎఫ్ లావాదేవీలతోపాటు కేవైసీ నిబంధనల వివరణ వంటివన్నింటినీ పూర్తిస్థాయిలో తెలుసుకోవచ్చని సెబీ ఈ సందర్భంగా చెప్పింది. అంతేగాక మదుపరుల సమస్యలకు పరిష్కార వ్యవస్థ, ఆన్‌లైన్ డిస్ప్యూట్ రిజల్యూషన్ (ఓడీఆర్) వేదిక కూడా ఉందన్నది. ఇన్వెస్టర్ల పర్సనల్ ఫైనాన్స్ ప్లానింగ్ కోసం అవగాహనను పెంచే వీడియోలు కూడా ఉంటాయి. కాగా, ఈ యాప్‌ను ఆండ్రాయిడ్ మొబైల్ యూజర్లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి, యాపిల్ మొబైల్ వినియోగదారులు ఐవోఎస్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



## కియా కారెన్స్ @ 1.5 లక్షలు

న్యూఢిల్లీ, జూన్ 3: దేశీయ వాహన మార్కెట్‌లో కియా కారెన్స్ జోరు మీదున్నది. 27 నెలల్లో 1.5 లక్షల యూనిట్ల అమ్మకాలను దాటింది. టయోటా ఇన్నోవా క్రిస్టా, మారుతీ సుజుకీ ఎర్టిగా తదితర మాడళ్ల నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికీ.. వాహనదారులను ఆకట్టుకుంటూ అమ్మకాల్లో దూసుకుపోతున్నది. 2022 ఫిబ్రవరిలో మార్కెట్‌కు పరిచయమైన కియా కారెన్స్‌లో సన్‌రూఫ్, మల్టీ డ్రైవ్ మోడ్స్, వెంటిలేటెడ్ సీట్స్, కనెక్టెడ్ కార్ టెక్నాలజీ ఉన్నాయి. ఇక ఈ కారు ధరల శ్రేణి రూ.12.88-23.94 లక్షల మధ్య ఉన్నది.

## టైగున్, వర్చుస్ మాడళ్లలో 6 ఎయిర్ బ్యాగులు

ముంబై, జూన్ 3: జర్మనీ ఆటో రంగ దిగ్గజం ఫోక్స్‌వాగన్.. భారత్‌లో అమ్ముతున్న 5-స్టార్ గ్లోబల్ ఎన్‌సీఏపీ సేఫ్టీ రేటింగ్ ఉన్న టైగున్, వర్చుస్ అన్ని వేరియంట్ల కార్లలో 6 ఎయిర్ బ్యాగులను ఆఫర్ చేస్తున్నది. ఈ మేరకు సోమవారం ఆ సంస్థ తెలిపింది. 2021 సెప్టెంబర్‌లో టైగున్, 2022 మార్చిలో వర్చుస్ మాడళ్లను దేశీయ మార్కెట్‌కు ఫోక్స్‌వాగన్ పరిచయం చేసింది. ఇటీవలే టైగున్ జీటీ లైన్, జీటీ ప్లస్ స్పోర్ట్ వేరియంట్లను తీసుకొచ్చింది. వీటిలో 1, 1.5 లీటర్ టర్బో-పెట్రోల్ ఇంజిన్లుంటాయి. కార్ల ధరల శ్రేణి రూ.11.5 లక్షల నుంచి రూ.25 లక్షల మధ్య ఉన్నది.

## పరేఖ్ జీతం రూ.66.24 కోట్లు



న్యూఢిల్లీ, జూన్ 3: ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ పరేఖ్ వార్షిక వేతనం గత ఆర్థిక సంవత్సరం (2023-24) 17 శాతం పెరిగి రూ.66.24 కోట్లకు చేరింది. దీంతో ఐటీ పరిశ్రమలో అత్యధిక జీతం పొందుతున్న సాఫ్ట్‌వేర్ కంపెనీల సీఈవోల్లో పరేఖ్ కూడా చేరిపోయారు. 2022-23లో పరేఖ్ జీతం రూ.56.4 కోట్లుగా ఉన్నది. ఇన్ఫోసిస్ తాజా వార్షిక నివేదిక ప్రకారం పరేఖ్ బేస్ సాలరీ రూ.7 కోట్లు. మిగతాదానిలో స్టాక్స్, వేరియబుల్ పేమెంట్స్ ఇతరత్రా ఉన్నాయి. ఇక టీసీఎస్ సీఈవో వేతనం రూ.25 కోట్లకుపైగా ఉన్నది.

### ప్రపంచ సీఈవోల్లో..

ఎస్అండ్‌పీ 500 కంపెనీల సీఈవోల వేతనాలు గత ఏడాది దాదాపు 13 శాతం పెరిగాయి. దీంతో సాధారణ ఉద్యోగులకు, చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ల జీతాలకు మధ్య వ్యత్యాసం ఇంకా పెరిగిపోయినట్టైంది. బ్రాడ్‌కామ్ సీఈవో హాక్ టాన్ వేతనం దాదాపు 162 మిలియన్ డాలర్లుగా ఉన్నది. ఇదే అత్యధికమని ఓ తాజా సర్వేలో తేలింది. ఇదిలావుంటే 2023లో అత్యధిక జీతాలు తీసుకున్న సీఈవోల్లో మహిళల సంఖ్య పెరిగింది. అడ్వాన్స్‌డ్ మైక్రో డివైజెస్ సీఈవో లిసా సు అగ్రస్థానంలో ఉన్నట్టు ఏపీ తెలియజేసింది.

## బెటర్ న్యూట్రిషన్‌లో సింధు పెట్టుబడులు



న్యూఢిల్లీ, జూన్ 3: భారత స్టార్ షట్లర్, తెలుగు క్రీడాకారిణి పీవీ సింధు.. గ్రీన్‌డేకు చెందిన 'బెటర్ న్యూట్రిషన్' బ్రాండ్‌లో పెట్టుబడులు పెట్టారు. ఈ బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా ఉన్నట్టు సోమవారం ఆమె ప్రకటించారు. బయోఫోర్టిఫైడ్ పుడ్స్ ద్వారా దేశంలో సూక్ష్మ పోషకాల కొరతను అధిగమించడమే లక్ష్యంగా ఈ బ్రాండ్ మార్కెట్‌లోకి వచ్చింది. కాగా, దేశంలో పోషకాహార లోపం ప్రధాన సమస్యగా తయారైందని, ఈ ఉత్పత్తులతో దాన్ని అధిగమించవచ్చని సింధు ఈ సందర్భంగా తెలిపారు.

## ఇంకా రాని రూ.2వేల నోట్లు రూ.7,755 కోట్లు

ముంబై, జూన్ 3: చలామణి నుంచి ఇంకా వెనక్కిరాని రూ.2,000 నోట్లు 2.18 శాతం ఉన్నాయని, వాటి విలువ రూ.7,755 కోట్లుగా ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సోమవారం ప్రకటించింది. ఇప్పటిదాకా 97.82 శాతం రూ.2వేల నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగొచ్చాయని చెప్పింది. 2023 మే 19న చలామణి నుంచి రూ.2,000 నోట్లను ఉపసంహరించుకుంటున్నట్టు ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. నాడు చలామణిలో ఉన్న ఈ నోట్ల విలువ రూ.3.56 లక్షల కోట్లు. ఇదిలావుంటే నిరుడు అక్టోబర్ 7దాకా దేశంలోని అన్ని బ్యాంక్ శాఖల్లో రూ.2,000 నోట్ల మార్పిడి జరిగింది. ఆ తర్వాత నుంచి హైదరాబాద్‌తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్బీఐ కార్యాలయాల్లో మాత్రమే ఈ మార్పిడికి వీలుంటున్నది.



# మార్కెట్ కిర్రాక్ షో

### ఆద్యంతం ఎగ్జిట్ పోల్స్ జోష్ • ఆల్‌టైమ్ హై గరిష్ఠాలకు సూచీలు

### రికార్డు స్థాయిలో సెన్సెక్స్ 2,507, నిఫ్టీ 733 పాయింట్లు అప్

ముంబై, జూన్ 3: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాల్లో పరుగులు పెట్టాయి. ఉదయం ప్రారంభమైన దగ్గర్నుంచి మధ్యాహ్నం ముగిసేదాకా సూచీలు ఫుల్ జోష్‌ను కనబర్చాయి. శనివారం చివరి విడుత పోలింగ్ ముగిశాక విడుదలైన ఎగ్జిట్ పోల్స్ అంచనాలు.. మదుపరుల్లో కొత్త ఊపును తీసుకొచ్చాయని మార్కెట్ నిపుణులు తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. కేంద్రంలో మరోసారి మోదీ సర్కారే వస్తుందన్నట్టుగా సీట్ల లెక్కలున్నాయి. ఈ క్రమంలోనే అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్, ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ.. ఆల్‌టైమ్ హై రికార్డులకు చేరాయి. సెన్సెక్స్ 2,507.47 పాయింట్లు లేదా 3.39 శాతం ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా 76,468.78 వద్ద నిలిచింది. ఇంట్రా-డేలో తొలిసారి 76,738.89 స్థాయిని తాకింది. నిఫ్టీ 733.20 పాయింట్లు లేదా 3.25 శాతం ఎగబాకి గతంలో ఎప్పుడూ లేనివిధంగా 23,263.90 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలో మొదటిసారి 23,338.70 స్థాయిని చేరింది. ఇదిలావుంటే 2021 ఫిబ్రవరి 1 నుంచి సెన్సెక్స్, నిఫ్టీలు ఒక్కరోజే ఈ స్థాయిలో పెరుగడం ఇదే తొలిసారి. నాడు కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో దాదాపు 5 శాతం పుంజుకున్నాయి. 2019 మే 20న కూడా ఎగ్జిట్ పోల్స్ అంచనాల మధ్య స్టాక్ మార్కెట్లు 3 శాతానికిపైగా పెరిగాయి. మరోసారి ఎన్డీఏ ప్రభుత్వమే గద్దెనెక్కుతుందన్న అంచనాలు.. పెట్టుబడులకు దోహదం చేసింది.

### రంగాలవారీగా..

ప్రభుత్వ రంగ సంస్థలు, విద్యుత్తు, చమురు, క్యాపిటల్ గూడ్స్, రియల్టీ తదితర రంగాల సూచీలు 8 శాతం వరకు పెరిగాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐ షేర్లు ఎక్కువగా లాభపడ్డాయి. 8 శాతం వరకు పుంజుకున్నాయి. దేశ జీడీపీపై వచ్చిన అంచనాలు కూడా మార్కెట్ ర్యాలీకి కలిసొచ్చినట్టు విశ్లేషకులు చెప్తున్నారు. ఇదిలావుంటే అదానీ గ్రూప్ షేర్లు ఇన్వెస్టర్లను విపరీతంగా ఆకట్టుకున్నాయి. గ్రూప్ సంస్థల మార్కెట్ విలువ రూ.19.42 లక్షల కోట్లను చేరింది. అదానీ పవర్ షేర్ విలువ దాదాపు 16 శాతం ఎగిసింది. అదానీ పోర్ట్స్ 10 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 6 శాతానికి పైగా పుంజుకున్నది.




### ఒక్కరోజే 13.78 లక్షల కోట్లు..

*సెన్సెక్స్, నిఫ్టీ భారీ లాభాల నడుమ బీఎస్ఈ, ఎన్ఎస్ఈ మదుపరుల సంపద కొత్త గరిష్ఠాలకు చేరింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన సంస్థల మార్కెట్ విలువ ఒక్కరోజే రూ.13,78,630.4 కోట్లు ఎగిసి తొలిసారి రూ.4,25,91,511.54 కోట్లకు (5.13 ట్రిలియన్ డాలర్లు) చేరింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లోని కంపెనీల మార్కెట్ విలువ కూడా రూ.422.48 లక్షల కోట్ల (5.09 ట్రిలియన్ డాలర్లు)కు వెళ్లింది.*

### గ్లోబల్ మార్కెట్లలో..

అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే.. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు లాభపడ్డాయి. చైనా నష్టపోయింది. ఐరోపా మార్కెట్లలో ప్రధాన సూచీలన్నీ లాభాల్లోనే కదలాడుతున్నాయి. ఇక బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 3.54 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 2.05 శాతం చొప్పున పెరిగాయి. ఒకానొక దశలో ఆల్‌టైమ్ హైని తాకాయి.

### ఆరంభంలో..

**2,622** పాయింట్లు ఎగిసి **76,583.29** వద్దకు సెన్సెక్స్

**807** పాయింట్లు ఎగబాకి **23,337.90** వద్దకు నిఫ్టీ

### ఇంట్రాడేలో..

**2,778** పాయింట్లు పుంజుకుని **76,738.89** వద్దకు సెన్సెక్స్

**808** పాయింట్లు అందుకుని **23,338.70** వద్దకు నిఫ్టీ

### ముగింపులో..

**2,507** పాయింట్లు పెరిగి **76,468.78** వద్ద సెన్సెక్స్

**733** పాయింట్లు వృద్ధి చెంది **23,263.90** వద్ద నిఫ్టీ